

తిరుపతి రైలు పొడిగింపు ఎప్పుడు?



- దశాబ్దం గడుస్తున్నా పట్టించుకోని రైల్వే శాఖ
- వారానికి రెండు రోజులే నడుస్తున్న రైలు
- జగిత్యాల వరకు పొడిగించి ఐదు రోజులు నడపాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

ప్రపంచంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరు గాంచిన తిరుపతికి వెళ్లేందుకు వారానికి రెండు రోజులు కరీంనగర్ నుంచి నడుపుతున్న కరీంనగర్- తిరుపతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును వారానికి ఐదు రోజులు నడపాలని ప్రయాణికులు కోరుతు న్నా కూడా రైల్వే శాఖ పట్టించుకోవడం లేదు. దశాబ్దకాలంగా ఈ రైలు వారానికి రెండు రోజులు మాత్రమే నడుస్తున్నది. ఈ రైలును జగిత్యాల వరకు పొడిగించాలని, వారానికి ఐదు రోజులు నడపాలని ప్రయా ణికులు మొత్తుకుంటున్నా రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పెద్దపల్లి నుంచి ఇందూరు వరకు నిర్మిం చిన నూతన రైల్వే మార్గం పూర్తయిన తర్వాత మొదట కరీంనగర్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ వరకు ప్రతి రోజు పుష్‌పుల్ రైలును ఆరంభించారు. రైల్వే లైన్ పను లు పూర్తయిన కొద్ది ఆ రైలును ఇందూరు వరకు పొడిగించారు. జగిత్యాల, సిరిసిల్ల, వేముల వాడ, పెద్దపల్లి, రామ గుండం, మంథని, కరీంనగర్ ప్రజలు తిరుపతికి వెళ్లాలంటే కాజీపేట, వరంగల్‌కు వెళ్లి పోవాల్సి వచ్చేది. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గమనిం చిన 2009లో కరీంనగర్ ఎంపీగా ఎన్నికైన పొన్నం ప్రభాకర్ గౌడ్ కరీంనగర్ స్టేషన్ నుంచి తిరుపతికి సూపర్ ఫాస్ట్ రైలును నడపాలని అప్పటి కేంద్ర రైల్వే శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీంతో 2011 నుంచి వారానికి ఒక రోజు కరీంనగర్ నుంచి వయా పెద్ద పల్లి, వరంగల్ మీదుగా సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును నడపడం ఆరంభించారు. ఈ రైలుకు డిమాండ్ పెరగడంతో పొన్నం ప్రభాకర్ అప్పటి యూపీఏ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకవచ్చి 2013 నుంచి వారానికి రెండుసార్లు గురు, ఆదివారాల్లో నడపడం ఆరంభించారు. 2014లో కరీంనగర్ ఎంపీగా ఎన్నికైన బోయినపల్లి వినోద్ కుమార్ తిరుపతి రైలును వారానికి కనీసం ఐదు రోజులైనా నడపాలని అప్పటి ఎన్‌డీఏ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన మేరకు 2016లో రెండు, మూడు నెలల పాటు వారానికి తిరుపతికి ఐదు రోజులు రైలును నడిపిన అధికారులు ఆ తర్వాత నిలిపి వేశారు. ఇప్పటికీ వారానికి రెండు రోజులు మాత్రమే నడుపుతున్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేశ్ నేత కరీంనగర్- తిరుపతి రైలును వారానికి ఐదు రోజులు నడపాలని కోరినప్పటికీ ఇప్పటికీ ప్రయో జనం లేకుండా పోయింది. మరోవైపు నిజామా బాద్ ఎంపీ అరవింద్ కూడా కరీంనగర్ రైలును కనీసం జగిత్యాల వరకు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం రాలేదు. గత ఏడాది జనవరి 2న ఎంపీ బండి సంజయ్ రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి తిరుపతి రైలు సర్వీస్ సేవలను పొడిగిం చాలని కోరినా కూడా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. అలాగే 2021-22లో జరిగిన టైమ్ టేబుల్ కమిటీ సమావేశంలో ఈ రైలును బాసర వరకు పొడిగించి అక్కడి నుంచి ఆర్మూర్, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, కరీంనగర్ మీదుగా నడిపించాలని ప్రతిపాదించి నప్పటికీ ఎటు వంటి కదలిక లేదు. ఈ రైలు జనరల్ స్లీపర్, టు టైర్, త్రీ టైర్ ఏసీ బోగీల్లో ప్రయాణిం చేందుకు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవాలంటే నెల రోజుల ముందు నుంచే చేసుకోవాల్సి వస్తున్నది. వెయిటింగ్ లిస్టులో వంద

(మిగతా 8వ పేజీలో)

మే 29 నుంచి పెద్దపల్లి జంక్షన్ నుంచి రిజర్వేషన్లు బంద్

పలు రైళ్లు పెద్దపల్లి జంక్షన్‌కు వెళ్లకుండా బైపాస్ రైల్వే లైన్‌ను నిర్మించారు. ఈ లైన్ వచ్చే నెల 29వ తేదీ నుంచి అందుబాటులోకి రానున్నదని తెలుస్తున్నది. మే 29న కరీంనగర్ నుంచి బయలు దేరనున్న తిరుపతి రైలుకు పెద్దపల్లి జంక్షన్ నుంచి టిక్కెట్ల రిజర్వేషన్ సౌకర్యాన్ని ఎత్తివేసి జమ్మికుంట నుంచి కల్పించడంతో ఈ ప్రాంత ప్రజలు భగ్గుమంటున్నారు. తిరుపతికి వెళ్లేందుకు జిల్లా వాసులే గాకుండా జగిత్యాల, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల నుంచి పెద్దపల్లికి వచ్చి వెళుతుంటారు. మే 29కి ముందే బైపాస్ లైన్ గుండా తిరుపతి రైలు వెళ్లనుండడంతో తామంతా ఎక్కడికి వెళ్లి రైలు ఎక్కాలని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై పెద్దపల్లి, కరీంనగర్ ఎంపీలు చొరవ తీసుకుని పెద్దపల్లి బైపాస్‌లో చీకురాయి వద్ద పెద్దపల్లి టౌన్ రైల్వే స్టేషన్ నిర్మించే వరకు పెద్దపల్లి జంక్షన్ గుండానే కరీంనగర్- తిరుపతి రైలు నడిపించాలని ఈ ప్రాంత భక్తులు కోరుతున్నారు.

పకడ్బందీగా వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ వేణు

మంథని/మంథనిరూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పకడ్బందీగా కొనుగోళ్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ వేణు ఆదేశించారు. మండలంలోని గుంజపడుగు, అంకూరు, మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏసీ వేణు బుధవారం సందర్శించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ 17 శాతం తేమ వచ్చిన ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీవో శ్రీమాల, ఆర్డీవో సురేష్, తహశీల్దార్ కుమారస్వామి, సీఈవో మామిడాల అశోక్‌కుమార్ ఉన్నారు.

నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలి

- పెద్దపల్లి డీసీపీ కరుణాకర్



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీసీపీ కరుణాకర్

ధర్మారం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పోలీసులు స్టేషన్‌కు వచ్చే దరఖాస్తుదారుల పట్ల మర్యాదగా, నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలని పెద్దపల్లి డీసీపి పి. కరుణాకర్ అన్నారు. మంగళవారం ధర్మారం పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ జి. కృష్ణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌తో పాటు చుట్టూ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ధర్మారం మండలంలోని పలు గ్రామాల్లోని శాంతిభద్రతల పరిస్థితిని ఎస్.ఐ. శీలం లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీసులు ప్రజల పట్ల, దరఖాస్తుదారుల పట్ల ఎంత మర్యాదగా ఉంటారో, నేరస్థుల పట్ల నేర చరిత్ర కలిగిన వ్యక్తుల పట్ల అంతే కఠినంగా ఉండాలని సూచించారు.

లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటం చేయాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ



మేడే పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

గోదావరిఖని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సర్కార్ కార్మిక వర్గంతో పాటు వివిధ రంగాలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, పైగా తమ న్యాయమైన సమస్యలపై పోరాడే ప్రజల్ని, కార్మికుల్ని, రైతులను అణిచివేతకు గురిచేస్తుందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో భారత కార్మిక సంఘాల సమస్య (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో 139వ మేడే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 49లేబర్ చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులను బడా పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టే కొత్రలకు ఒడిగట్టిందన్నారు. ఈ 139వ మేడే సందర్భంగా ఐఎఫ్‌టీయూ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా లేబర్ కోడ్లు రద్దుచేసి గత కార్మిక చట్టాన్ని కొనసాగించాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, స్కీం వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, నియంత్రణ చేయాల్సింది గ్లోబల్ పెట్టుబడిని తప్ప గ్లోబల్ శ్రమశక్తిని కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఈ నరేష్, బీ అశోక్, చిలుక శంకర్, ఐ రాజేశం, కొల్లూరి మల్లేష్, పైడిపల్లి రమేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలకు కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు



సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల

పెద్దపల్లి టౌన్, ఎప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష ఎన్నికల్లో రెండుసార్లు అంబేద్కర్‌ను ఓడించి, విదేశీ బానిసత్వాన్ని పునికిపుచ్చుకున్న కాంగ్రెస్ పార్టీకి అంబేద్కర్ పేరెత్తే అర్హత లేదని భారతీయ జనతా పార్టీ దళిత మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ అవగాహన సదస్సులో భాగంగా రంగంపల్లిలోని సాయిగార్డెనులో బుధవారం అంబేద్కర్ జయంతి ఉత్సవ జిల్లా కన్వీనర్ పల్లె సదానందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధంగా పరిపాలన సాగిస్తున్న ఏకైక పార్టీగా బీజేపీ చరిత్ర సృష్టించిందన్నారు. అంబేద్కర్ వ్యక్తిత్వాన్ని ప్రపంచానికి చాటేలా పార్లమెంటులో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేయడం, పంచ్ తీర్థ్ పేరుతో పర్యాటక స్థలాలను నిర్మించడం, స్మృతివనాలను నెలకొల్పడం వంటి అద్భుతమైన పనులు ప్రధాని నరేంద్రమోదీ చేతిలో రూపుదిద్దుకున్నాయని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో రాజ్యంగానికి తూట్లు పొడిచి, సొంత అజెండాను అమలు చేసి, రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందన్నారు. కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, కంకణాల జ్యోతిబసు, మచ్చ విశ్వాస్, మిట్టపల్లి సతీష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు సిరిసిల్ల శంకర్, అరికెల లక్ష్మణ్, పర్శ సమ్మయ, వెల్లంపల్లి శ్రీనివాస్, జంగ చక్రధరరెడ్డి, బెజ్జంకి దిలీప్ కుమార్ పాల్గొన్నారు

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లల్ని చదివించాలి

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊషన్నపల్లిలోని ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. అనంతరం పాఠశాల పిల్లలకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న వంగ మేఘనకు గురుకుల పాఠశాలలో సీటు రావడంపట్ల బాలికను ఎంఈఓ మహేష్, హెచ్‌ఎం నరెడ్ల సునీత, ప్రధానోపాధ్యాయులు ఈర్ల సమ్మయ్య అభినందించారు. ప్రతిభ కనబరిచిన వంగ మేఘనకు ఒక ఇంగ్లీష్, తెలుగు డిక్షనరీ, ప్రశంసాపత్రం అందించారు. చైర్ పర్సన్ స్వరూప, ఉపాధ్యాయులు అమృతసురేష్‌కుమార్, కొంకటి శ్రీవాణి, పిల్లలు, తల్లిదం డ్రులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి, రామగుండం బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య ఘర్షణ

పెద్దపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో పెద్దపల్లి, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నది. బుధవారం శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత జిల్లా పర్యటనకు వచ్చారు. అందులో భాగంగా సాయంత్రం రాఘవాపూర్ వద్ద గల పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. కవిత ప్రెస్‌మీట్ నిర్వహించిన అనంతరం ఆమెతో పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఫొటోలు దిగేందుకు పోటీ పడ్డారు. ఈ క్రమంలో కొందరు తోసుకున్నారు. కవిత కారు ఎక్కి వెళ్లిన తర్వాత రెండు నియోజకవర్గాల నేతలు తిట్టుకుంటూ ఘర్షణకు దిగారు. కొద్దిసేపు ఇరు వర్గాలు తోపులాడుకున్నారు.

భూభారతి చట్టంపై సందేహాల నివృత్తి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన ఆర్వోఆర్ భూభారతి చట్టంపై రైతులకు, ప్రజలకు ఉన్న సందేహాలను పూర్తి స్థాయిలో నివృత్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండలంలోని నాగారం రైతు వేదికలో బుధవారం ఏర్పాటు చేసిన భూభారతి చట్టం అవగాహన కార్యక్రమంలో వివిధ అంశాలను కలెక్టర్ శ్రీహర్ష రైతులకు, ప్రజలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూసమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై భూభారతి చట్టం ప్రకారం అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆర్డీవో నిర్ణయం కలెక్టర్ వద్ద, కలెక్టర్ నిర్ణయంపై భూమి ట్రిబ్యూనల్ వద్ద అప్పీల్ చేసుకోవచ్చన్నారు. గతంలో ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి ఉండేదని నేడు అప్పీల్‌కు అవకాశం కల్పించిందన్నారు. అప్పీల్ తీర్పు తర్వాత కూడి సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టుకు వెళ్లవచ్చన్నారు. దరఖాస్తుదారులకు అవసరమైన ఉచిత న్యాయ సలహాలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులను తయారు చేసి ప్రతి సంవత్సరం గ్రామాల్లో రికార్డులను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మనిషికి ఆధార్ కార్డులా భూమికి భూధార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని దీని ద్వారా భూఆక్రమణలకు చెక్ పెట్టవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా పరిష్కారం కోసం భూభారతి చట్టంలో ప్రభుత్వం ఆవకాశం కల్పించిందన్నారు. పీవోటీ, ఎల్‌టీఆర్, సీలింగ్ చట్టాల ఉల్లంఘనలు లేని దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, వంద రూపాయాల అపరాధ రుసుం వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. అప్పుల రికార్డులను, వివరాలను నమోదు చేసి పాసుబుక్ జారీ చేస్తామ న్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ మ్యూటే షన్ ఒకే రోజు ఉంటాయన్నారు. కొనుగోలు, దానం, తనఖా బదిలీ పంపకాల ద్వారా భూమిపై హక్కు లు సంక్రమిస్తే తహశీల్దార్ రిజిస్ట్రేషన్ చేసి హక్కుల రికార్డులు మార్పులు చేసి పట్టాదారు పాసుబుక్ జారీ చేస్తారన్నారు. వారసత్వం, వీలునామా ద్వారా భూమిపై హక్కులు సంక్రమిస్తే తహశీల్దార్ విచా రణ జరిపి హక్కుల రికార్డులో మ్యూటేషన్ చేస్తారని, నిర్ణయిత గడువులోగా పూర్తి చేయకుంటే ఆటోమెటిక్‌గా మ్యూటేషన్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సురేష్, తహశీల్దార్ కుమారస్వామిలు పాల్గొన్నారు.

కార్మికులకు పంగనామాలు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఎమ్మెల్సీ కవిత



సమావేశంలో మాట్లాడుతున్న కల్వకుంట కవిత



అమరులకు నివాళులర్పిస్తున్న కవిత, పార్టీ నాయకులు

గోదావరిఖని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మూడు రంగుల జెండా పార్టీ కార్మికులకు మూడు పంగనామాలు పెట్టిందని ఎమ్మెల్సీ టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. బుధవారం రాత్రి టీబీజీకేఎస్ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు బొంబాయి, దుబాయి, బొగ్గుబాయి అనే నినాదం ఉండేదని, చాలా మంది దుబాయి ఎడారిలో పని చేసేవారని అన్నారు. తనకు రెండు సందర్భాల్లో కన్నీళ్లు వచ్చాయని, దుబాయికి వెళ్లినప్పుడు ఎడారిలో ఆయిల్ రీచ్‌ల వద్ద ఎండలో ఇసుకలో పనిచేసే మన కార్మికులను చూస్తే దుఃఖం వచ్చిందని, మరో సంఘటన సింగరేణిలోని మృత్యు గుహల్లో పనిచేసే కార్మికులు పనికి వెళితే తిరిగి వస్తారో లేదోనని ఉండేదని, కార్మికుడు గనిలోకి దిగే ముందు, పైకి వచ్చిన తరువాత పోచమ్మను మొక్కే వారని, అప్పుడు కూడా దుఖంవచ్చిందని అన్నారు. తెలంగాణ వచ్చిన తరువాత కార్మికుల బతుకులను మార్చారని, తెలంగాణ ఉద్యమంలో సింగరేణి కార్మికుల పాత్ర మరిచిపోలేనిదని, కేసీఆర్ గని కార్మికుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారన్నారు. డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని పట్టుబట్టారని, అప్పుడు తాను, మిర్యాల రాజిరెడ్డి, సింగరేణి మాజీ చైర్మన్, నర్సింగారావులను కూర్చుండబెట్టి వంద శాతం డిపెండెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని పట్టుబట్టామని, సీఎండీ 100కు వందశాతం ఇవ్వలేమని, 96శాతం ఇస్తామని హామీ ఇచ్చారని, అదే ఇప్పుడు కొనసాగుతుందన్నారు. టీబీజీకేఎస్ తన పని తీరును సమీక్షించుకోవాలని, కుళ్లు, కుట్రలు, కుతంత్రాలు, రాజకీయాలు మానుకోవాలని, యువ కార్మికులు చాలా మంది సంస్థలో పని చేస్తున్నారని, యువ రక్తాన్ని ప్రోత్సహించాలని సూచించారు. ఎర్రజెండా యూనియన్లు సింగరేణిని భ్రష్టు పట్టించాయన్నారు. ఈ సందర్భంగా కవితను గజమాలతో సత్కరించారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ నాయకులు మిర్యాల రాజిరెడ్డి, మాదాసు రామమూర్తి, వడ్డేపల్లి శంకర్, నూనె కొమురయ్య, చెల్పూరి సతీష్, కౌశిక హరితో పాటు వివిధ డివిజన్ల టీబీజీకేఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ ర్యాలీ

కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రదాడిని నిరసిస్తూ గోదావరిఖని చౌరస్తాలో బుధవారం రాత్రి మృతులకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కొవ్వొత్తులో నివాళులర్పించారు. స్థానిక టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి వచ్చిన కవిత ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలంటూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉగ్రవాదుల చర్యను యావత్ దేశం ముక్తకంఠంతో ఖండించాలని, ప్రజలకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

కర్రెగుట్టలో కాల్పులు నిలిపివేయాలి

పెద్దపల్లిటౌన్. ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించిన మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని, కాల్పుల విరమణ, ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని పౌర హక్కుల, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర గడ్చిరోలి, తెలంగాణ, ఒడిస్సా రాష్ట్ర అటవీ ప్రాంతాల్లో చేపట్టిన ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని గత కొన్ని రోజులుగా దేశంలోని మేధావులు, హక్కుల సంఘాలు, ప్రజాస్వామిక వాదులు విజ్ఞప్తి చేస్తున్నారన్నారు. సమావేశంలో పౌరహక్కుల, ప్రజా సంఘాల నాయకులు మాదన కుమారస్వామి, శ్రీపతి రాజగోపాల్, పుల్ల సుచరిత, యాదవనేని పర్వతాలు, సత్యనారాయణ, కె. విశ్వనాథ్, బాలసాని రాజయ్య, గాండ్ల మల్లేశం, మార్వాడీ సుదర్శన్, రామిల్ల బాపు, ముడిమడుగల మల్లయ్య పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంతో స్వయం ఉపాధికి బాటలు

- ధర్మారం మండలంలో 3,548 దరఖాస్తులు

ధర్మారం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఆర్థిక చేయూత అందించి స్వయం ఉపాధి కల్పించాలని ప్రారంభించిన పథకం రాజీవ్ యువవికాసం. ఈ పథకం ద్వారా గత నెల 15 నుంచి ఈ నెల 4 వరకు దరఖాస్తులు స్వీకరించగా, ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన రావడంతో మరో పది రోజుల పాటు గడువు పెంచారు. దీంతో యువకులు మొదలుకొని 55 సంవత్సరాల వయస్సు వారు వివిధ కేటగిరీల్లో లోన్లు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ధర్మారం మండల వ్యాప్తంగా 3,548 మంది దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తుదారుల రుణచరిత్ర పరిశీలన

ఇప్పటికే ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మండలంలోని ఎస్‌బిఐ, యూనియన్, కేడీసీసీ, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల మేనేజర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం అనంతరం ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖా స్తులను డౌన్‌లోడ్ చేసి బ్యాంకుల వారీగా వచ్చిన దరఖాస్తులను ఆయా శాఖల మేనేజర్లకు అప్పగించారు. ఆయా బ్యాంకుల మేనేజర్లు లబ్ధిదారుల ఎంపిక లిస్టును తయారు చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. లోన్ అప్లికేషన్‌లో తమ బ్యాంకు ఎంచుకున్నారో వారి పూర్తి వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా బ్యాంక్ అధికారులు దరఖాస్తుదారుని సిబిల్ చెక్ చేయడమే కాకుండా ఇంతకు ముందు తమ శాఖలో ఏమైనా రుణ సదుపాయం పొందారా? ఒకవేళ పొందితే ఆ రుణానికి సంబంధించిన కిస్తీలు నెలనెలా ఎలా చెల్లిస్తున్నారు. ఇప్పటి వరకు పూర్వపు లోన్లు ఏమైనా ఎన్‌పీఏలో ఉన్నాయా? అనే అంశాలు లబ్ధిదారుల ఎంపికలో కీలకంగా మారనున్నాయి. ఈ పరిశీలన అనంతరం అభ్యంతరం లేని పేర్లను ఎంపిక చేసి ఆయా బ్యాంకు శాఖల మేనేజర్లు మండల అభివృద్ధిశాఖ అధికారులకు జాబితా అప్పజెప్పనున్నారు. అనంతరం అభ్యర్థుల వార్షిక ఆదాయం, కులం, ఫుడ్ సెక్యూరిటీ కార్డుల ఆధారంగా జాబితా తయారు చేస్తారు. కొన్ని రుణాలకు 21 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల వరకు వయస్సు నిబంధన ఉండగా, అగ్రికల్చర్ సెక్టార్లలో రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మరో 5 సంవత్సరాలు సడలింపు కల్పిస్తారు. అదే విధంగా ఆటో కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న వారికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి, వికలాంగుల కోటాలో దరఖాస్తు చేసుకున్న వారికి సదరన్ సర్టిఫికెట్ పరిశీలిస్తారు. పరిశీలన అనంతరం ఎంపిక చేసిన జాబితాను జిల్లా కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తారు. ప్రభుత్వ ఆదేశానుసారం రుణాలు అందించనున్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదానికి కారణమైన సంఘటనలో మండల కేంద్రానికి చెందిన వాహన డ్రైవర్ మేఘ రాజుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ బుధవారం తెలిపారు. ఈనెల 22న రాత్రి పెద్దపల్లి జిల్లాలోని రాఘాపూర్‌కు చెందిన ఏనుగుల సదయ్య తన వరికోత యంత్రంతో మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని వరికోసి ఎల్లారెడ్డిపేట వైపు వెళ్తున్నాడన్నారు. మండల కేంద్రంలోని మేఘరాజు కారును అతివేగం, అజాగ్రత్తగా నడిపి వరికోత యంత్రాన్ని వెనుకనుంచి ఢీకొట్టాడని చెప్పారు. ప్రమాదంలో వరికోత యంత్రం భాగాలు ధ్వంసమయ్యాయని, సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని తెలిపారు. బాధితుడు సదయ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ మేఘ రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

దొంగతనం కేసులో నిందితుడికి జైలుశిక్ష

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని బాలపల్లి, జాబితాపూర్ గ్రామాల్లో గల కొత్తరాజేశ్వరస్వామి, లలితపరమేశ్వరి ఆలయాల్లో 2024 అక్టోబర్‌లో దొంగతనానికి పాల్పడ్డ తాటిపల్లి గ్రామానికి చెందిన వడ్లూరి నాగరాజుకు అనే నిందితుడికి 4 నెలల 11 రోజులు జైలు శిక్షతో పాటు రూ.400 జరిమానా విధించారు. కోర్టులో కానిస్టేబుల్‌రామకృష్ణ సాక్షులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజని వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలు రుజువుకావడంతో బుధవారం నిందితుడికి శిక్ష విధిస్తూ జడ్జి శ్రీనిజ కొహిర్కర్ తీర్పు వెలువరించారు.

చెరువులో యువకుడి గల్లంతు

జగిత్యాల అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలోని చింతకుంట చెరువులో బుధవారం పట్టణానికి చెందిన నీలి మల్లికార్జున్(35) అనే యువకుడు గల్లంతయ్యాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం పట్టణానికి చెందిన నీలి భీమక్క అనే వృద్ధురాలు మృతిచెందగా మనవడి వరస అయ్యే మల్లికార్జున్ దినకర్మకు హాజరయ్యాడు. అనంతరం స్నానం చేయడానికి చెరువులోకి దిగాడు. చెరువులోని ఒక ఒడ్డు నుంచి మరో ఒడ్డుకు ఈత కొడుతుండగా మధ్యలోనే మునిగిపోయాడు. రెండు ఒడ్ల మధ్య సుమారు 150మీటర్లకు పైగా దూరం ఉండడంతో ఈదలేక మధ్యలోనే మునిగిపోయాడని ప్రత్యక్షసాక్షులు తెలిపారు. అయితే బంధువులు అతడిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. పోలీసులు గజఈతగాళ్ల సహాయంతో చెరువులో గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు.

వేర్వేరు ప్రాంతాల్లో వడదెబ్బతో ఇద్దరి మృతి


రమేష్(ఫైల్)

రామడుగు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావుపేటకు చెందిన కల్లెం రమేష్(55) వడదెబ్బతో మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రమేష్ వివిధ పనుల నిమిత్తం ఎండలో తిరిగాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. రాత్రివాంతులు,విరేచనాలతో బాధపడుతూ అర్ధరాత్రి మృతిచెందినట్లు తెలిపారు.

యైటింక్లయిన్‌కాలనీ: వడదెబ్బతో కాలనీలో పుల్లూరి రమేష్(37) అనే వ్యక్తి బుధవారం మృతి చెందాడు. కాలనీలో ఉంటూ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న రమేష్ మూడు రోజుల పాటు విధులకు వెళ్లి బుధవారం ఇంటికి వచ్చాడు. నీరసంగా ఉన్న రమేష్‌ను కుటుంబ సభ్యులు గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా వడదెబ్బ తగిలిందని వైద్యులు మందులు ఇచ్చారు. ఆసుపత్రి నుంచి ఇంటికి రాగా ఇంటి ముందు రమేష్ కుప్పకూలాడు. బంధువులు గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే రమేష్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.



అధిక లోడ్‌తో అదనపు బిల్లు

- మీటర్లపై భారం పడకుండా చూస్తే మంచిది
- అవసరానికి అనుగుణంగా మీటర్ తీసుకుంటే మేలు

గణేశ్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యుత్ పొదుపు పాటించకుంటే అదనంగా చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. బిల్లు అధికంగా వస్తే అదనంగా డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించాలి. ఈ బిల్లులు అధికంగా వచ్చిన సమయంలో డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లించాలని విద్యుత్ అధికారులు నోటీసులు జారీ చేస్తారు. మీటర్‌కు దరఖాస్తు చేసుకున్న సమయంలోనే వినియోగదారుల్లో చాలామంది ఒక కిలోవాట్ సామర్థ్యం చాలంటూ డీడీలు చెల్లిస్తారు. ఆ సమయంలో నాలుగు బల్బులు, రెండు ఫ్యాన్లు, టీవీ ఉన్నట్లు పేర్కొంటారు. తర్వాత ఇంట్లో కూలర్లు, ఏసీలు, ఫ్రిజ్లు, వాషింగ్ మిషన్లు, రైస్ కుక్కర్లు, గీజర్లు అదనంగా వచ్చి చేరుతుంటాయి. దీంతో దరఖాస్తు చేసుకున్న దానికంటే అధికంగా లోడు పెరిగి భారం విద్యుత్ ఫీడర్లపై పడుతుంది. దీంతో విద్యుత్ అధికారులు అధిక భారాన్ని అధిగమించడానికి కొత్త విద్యుత్ స్తంభాలు, విద్యుత్తు లైన్లు వేయాల్సి ఉంటుంది. ఇందుకయ్యే ఖర్చును ఎవరైతే అధిక లోడు విని యోగించుకుంటున్నారో వారిపై వేస్తారు.

● **అవగాహన లేక..:** డెవలప్‌మెంట్ చార్జీల విషయమై చాలా మందికి అవగాహన ఉండదు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తుంటారు. ముందుగా ఇంట్లోకి అదనంగా ఉపకరణాలు తీసుకొస్తే వాటికి విద్యుత్ ఎంత అవసరమో తెలుసుకోవాలి. విద్యుత్ అధికారులతో మాట్లాడి మీటర్ పరిధిని మార్చాలని దరఖాస్తు చేసుకోవాలి. అదనంగా కిలోవాట్‌కు 1,200 రూపాయలు సెక్యూరిటీ డిపాజిట్ కింద 200 రూపాయలను మీసేవలో చెల్లిస్తే మీటర్ పరిధి వారం రోజుల్లో మారుతుంది. దీంతో అధిక చార్జీలు ఉండవు. ఒకేసారి వినియోగించినప్పుడు అధిక లోడ్ నమోదవుతుంది. ఈ సమస్యను నుంచి బయటపడాలంటే మీటర్ల సామర్థ్యం పెంచుకోవడమే ఉత్తమమని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

మీటర్లపై భారం పడకుండా చూడాలి

మేక రమేశ్‌బాబు, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ



మీటర్ తీసుకునే ముందు ఎన్ని కిలో వాట్లు అవసరం ఉంటుందో విద్యుత్ అధికారులకు చెబితే బాగుంటుంది. అధిక చార్జీల భారం పడకుండా ఉంటుంది. తక్కువ కిలోవాట్‌కు డిపాజిట్ చెల్లించి ఆ తరువాత వచ్చే అధిక బిల్లులతో ఇబ్బంది పడొద్దు. కార్యలయల చుట్టూ తిరిగినా విద్యుత్ బిల్లులు తగ్గకపోగా అదనపు చార్జీల భారం పడుతుంది. విద్యుత్ వినియోగదారులు ఆదికారులను సంప్రదించి బిల్లులు చెల్లించి అదనపు లోడ్‌ను రెగ్యులర్ చేయించుకోవాలి.

చట్టంతో ఆడుకున్న చెన్నమనేనిని కఠినంగా శిక్షించాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్
- ఆదిశ్రీనివాస్ వాంగ్మూలం నమోదుచేసిన సీఐడీ పోలీసులు


హైదరాబాదులోని సీఐడీ కార్యాలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భారత పౌరుడు కాకుండానే శాసనసభ్యుడిగా పోటీచేసిన మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు చెన్నమనేని రమేష్‌ను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో భారత పౌరసత్వం పొందారని నిర్ధారిస్తూ చెన్నమనేని రమేష్ పౌరసత్వాన్ని హైకోర్టు రద్దుచేసిన నేపథ్యంలో ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ ఆదిశ్రీనివాస్ సీఐడీ పోలీసులకు ఫిర్యాదుచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సీఐడీ పోలీసులు ఆది శ్రీనివాస్ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం సీఐడీ కార్యాలయం ఆవరణలో ఆది శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ చెన్నమనేని రమేష్‌బాబు భారతీయుడు కాకుండానే భారతీయుడని చట్టసభల్లో అడు గుపెట్టారని, ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. చట్టంతో ఆడు కున్న వ్యక్తిని కఠినంగా శిక్షించడం ద్వారా భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు ఎవరూ చేయకుండా చూడ వచ్చన్నారు. ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు రమేష్ బాబు ఏ దేశ పాస్‌పోర్టు మీద భారతదేశానికి వచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. భారత దేశ పౌరుడైతేనే జడ్పీటీసీగా, ఎంపీటీసీగా, సర్పంచ్‌గా, ఎమ్మెల్యేగా ఎం పీగా పోటీచేయాలని మనదేశ చట్టం చెబుతుందన్నారు. దేశ పౌరుడు కాదని తీర్పువచ్చిన నేపథ్యంలో అధికా రులు విచారణ జరిపి 2009 నుంచి ఎమ్మెల్యేగా ఉన్న కాలాన్ని సరిచేయాలని, ఈ తీర్పుతో న్యాయస్థానాలపై గౌరవం పెరిగిందని, 14 సంవత్సరాల పోరాటంలో తనకు అండగా ఉన్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కొడిమ్యాల, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన దుబ్బాక జమున(26) అనే వివాహిత కొద్ది రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేయగా మంగళవారం రాత్రి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. జమునకు గత సంవత్సరం మార్చిలో కొడిమ్యాలకు చెందిన దుబ్బాక రాహుల్‌తో వివాహం జరిగింది. ఆరు నెలల నుంచి ఆమెభర్త రాహుల్, మామ దుబ్బాక లక్ష్మీనారాయణ అదనపు వరకట్నం కోసం వేధింపులకు గురి చేశారని మృతురాలి తల్లి కొమ్ము పోషవ్వ ఫిర్యాదు చేసింది. భర్త, మామ అదనపు వరకట్నం వేధింపులతో ఈనెల 21న ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేయగా జగిత్యాలలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి పోషవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యను వేధించిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించిన సిరిసిల్ల పట్టణం సిద్దులవాడకుచెందిన కర్లబత్తుల ప్రేమ్‌సాగర్ రావుకు ఏడాదిజైలు శిక్షతోపాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ బుధవారం సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించినట్లు సిరిసిల్ల టౌన్‌సీఐ కె కృష్ణ తెలిపారు. ఆయన వివరాలప్రకారం... సిరిసిల్ల పట్టణంలోని సిద్దులవాడకు చెందిన కర్లబత్తుల పద్మావతికి మాజీఏఈఈ కర్లబత్తుల ప్రేమ్ సాగర్‌రావుతో 31సంవత్సరాల క్రితం వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కూతుళ్లు. ఏఈఈగా పనిచేసిన ప్రేమ్ సాగర్‌రావు సస్పెండ్ కావడంతో తాగుడుకు బానిసై తరచూ భార్య పద్మావతిని డబ్బులు అడగడమే కాకుండా ఇవ్వకుంటే కొడుతుండేవాడు. జనవరి 27, 2017న తన భర్త ప్రేమ్‌సాగర్‌రావు ఇంట్లోకి తాగివచ్చి డబ్బులు ఇవ్వమని కొట్టి మానసికంగా వేధించాడని భార్య పద్మావతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా అప్పటి విచారణ అధికారి లియకత్ అలీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశాడు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ అధికారి శ్రవణ్‌యాదవ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ వేముల నరేశ్ ఆరుగురు సాక్షులను ప్రవేశపెటారు. పీపీసందీప్ వాదించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ప్రవీణ్ నేరస్థుడైన ప్రేమ్‌సాగర్‌రావుకు ఏడాదిజైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధించారని సీఐ కృష్ణ తెలిపారు.

బోర్ల విద్యుత్ వైర్లు చోరీ

గంగాధర, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం రంగరావుపల్లి, తాడిజెర్రిలో వ్యవసాయ బోర్ల విద్యుత్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిజెర్రి, రంగరావుపల్లి గ్రామాల్లో బోర్ల డబ్బాలకు ఎప్పటిలాగే మంగళవారం తాళంవేసి వెళ్లారు. బుధవారం పొలాలకు వెళ్లిన రైతులకు డబ్బా నుంచి బోరు మోటారుకు వేసిన వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. తాడిజెర్రిలోని ఐదుగురు రైతులు, రంగరావుపల్లిలో ఒక్కరైతుకు చెందిన 4వందల మీటర్లవైరును ఎత్తుకెళ్లారు. వైరు విలువ 52వేలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతులు తెలిపారు.

నష్టపరిహారం చెల్లించాకే షెడ్డును కూల్చండి

- సబ్‌స్టేషన్ పనులను అడ్డుకున్న బాధితులు


షెడ్డును కూల్చకుండా అడ్డుగా నిల్చున్న బాధితులు

వేములవాడ టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం రుద్రవరం గ్రామానికి మంజూరైన సబ్‌స్టేషన్ స్థలంలోని షెడ్డును సంబంధిత అధికారులు కూల్చేందుకు ప్రయత్నించగా, భూయజమానులు తమకు నష్టపరిహారం అందలేదని, పరిహారం వచ్చిన తర్వాతే షెడ్డును కూల్చాలని పనులను అడ్డుకున్నారు. వేములవాడ మండలం అనుపురం గ్రామానికి చెందిన నాంపల్లి రాజయ్యకు చెందిన 383, 384 సర్వే నంబర్ గల స్థలంలో షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు. సదరు షెడ్డుకు ఇప్పటి వరకు నష్టపరిహారం రాలేదని, నష్టపరిహారం చెల్లించిన తరువాతనే షెడ్డును కూల్చాలని భీష్మించుకు కూర్చున్నారు. దీంతో చేసేదేమి లేక సంబంధిత అధికారులు అక్కడి నుంచి తిరిగి వెళ్లిపోయారు. నష్టపరిహారం చెల్లించకుండా తమ షెడ్డును కూల్చివేస్తే తరువాత జరుగు సంఘటనలకు అధికారులు బాధ్యత వహించాలని భూయజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

అంతర్రాష్ట్ర దొంగ రిమాండ్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండల పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడిన మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను బుధవారం రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్ తెలిపారు. ఈ మేరకు విలేకరులకు వివరాలు వెల్లడించారు. గతేడాది జూలైలో కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని గుంటూరుపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడిన దొంగలు 2.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. అనంతరం మల్కాపూర్ రోడ్డులోని పీవీఆర్ గార్డెన్స్ సమీపంలో కె.రాజేంద్రప్రసాద్ ఇంటి తాళాలు పగలగొట్టి మద్యం సీసాలతో పాటు హీరో హోండా మోటార్ సైకిల్‌ను దొంగిలించారు. ఈ ఘటనలపై కరీంనగర్ రూరల్, కొత్తపల్లి పోలీసులు కేసు విచారణ చేపట్టారు. దర్యాప్తులో నిందితులు మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లాకు చెందిన ప్రదీప్, విక్రమ్, హత్రు సింగ్, జితేన్‌గా గుర్తించారు. కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ పోలీసుఠాణాలో రెండు కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో ప్రధాన నిందితుడైన ప్రదీప్‌ను గత మార్చిలో రిమాండ్‌కు తరలించామని ఏఎస్పీ శుభం ప్రకాశ్ తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడైన హత్రుసింగ్ మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లా నరవాలిలో ఉన్నాడని సమాచారం రావడంతో, కొత్తపల్లి ఎస్ఐ సాంబమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లిందని, మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి కరీంనగర్‌కు తీసుకొచ్చిందని తెలిపారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు విక్రమ్, జితేన్ పరారీలో ఉన్నారని, వారిని పట్టుకోవడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల శివారులోని వెలిచాల ఎక్స్ రోడ్డు వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి మండలం నాగులమల్యాల గ్రామానికిచెందిన మొగిలిపాలెం గంగరాజు(42) మృతి చెందాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. గంగరాజు గంగాధర మండలం సర్వారెడ్డిపల్లిలో పని ముగించుకొని తనబైక్‌పై నాగులమల్యాలకు బయల్దేరాడు. వెలిచాల ఎక్స్‌రోడ్డు వద్ద ఒకలారీ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో గంగరాజు ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తీవ్రగాయాలతో గంగరాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు, మృతుడి కొడుకు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన కార్యదర్శి ఆచూకీ తిరుపతిలో లభ్యం..

- 48 గంటల ఉత్కంఠకు తెర

తంగళ్లపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రియాంక తిరుపతిలో దొరికింది. గత రెండు రోజులుగా కార్యదర్శి అదృశ్యంపై రాజన్న సిరిసిల్ల జిల్లాలో కలకాలం ఎట్టకేలకు పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఆంధ్రప్రదేశ్ తిరుపతిలో ఉన్నట్టు గుర్తించారు. కార్యదర్శి తండ్రి రాజేష్ బంధువులతో కలిసి పోలీసుల సహకారంతో ప్రియాంక ఉన్న చోటుకు బుధవారం చేరుకున్నారు. కాగా, కార్యదర్శి ప్రియాంకను 'ఆంధ్రజ్యోతి' ఫోన్లో సంప్రదించగా, రాజీనామా చేయడానికి గల కారణాలను వివరించింది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని అందుకే రాజీనామా చేసి తిరుపతి వెళ్లినట్లు వివరించారు. నిబంధనల ప్రకారం ఉద్యోగం చేస్తే అవమానాలు ఎదురవుతున్నాయని, ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్న పరిశీలించే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. తల్లిదండ్రులు తనను క్షమించాలని వేడుకుంది. కాగా, ప్రియాంకను తీసుకొని తిరుపతి నుంచి బయలుదేరినట్టు, రాత్రి వరకు చేరుకుంటామని కార్యదర్శి తండ్రి రాజేశం తెలిపారు. 48 గంటలుగా కార్యదర్శి అదృశ్యంతో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.

తండ్రిపై దాడి కేసులో కుమారుడి అరెస్ట్

ధర్మపురి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలం కొసునూర్‌పల్లె గ్రామంలో తండ్రి వేముల సుకేందర్‌రెడ్డిపై రోకలి బండతో దాడి చేసిన కేసులో కొడుకు వేముల విక్రం రెడ్డిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మార్చి 20న సుకేందర్ రెడ్డితో ఇంటి వద్ద గొడవ పడి కొడుకు విక్రంరెడ్డి రోకలి బండతో గాయపరచినట్లు ఆయన పేర్కొన్నారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న విక్రంరెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ జైలుకు పంపించినట్లు ఆయన తెలిపారు.

కారును ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

శంకరపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామశివారులో బుధవారం కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన ఓ కుటుంబం వరంగల్‌లో వివాహానికి హాజరయ్యేందుకు కారులో వెళ్తున్నారు. వరంగల్‌డిపోకు చెందిన బస్సు నిజామా బాద్‌కు ప్రయాణికులతో వెళ్తోంది. మార్గ మధ్యలో కొత్తగట్టు శివారులో కారును బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారుముందు భాగం దెబ్బతింది. విషయం తెలుసుకున్న బ్లూకోల్ట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

సిరిసిల్లలో వర్షం


- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంతోపాటు విలీన గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలుప్రాంతంలో చెట్లు విరిగిపోయాయి. అలాగే విలీన గ్రామాలైన పెద్దూర్, పెద్దబోనాల, చిన్నబోనాల, చంద్రంపేట, రగుడు గ్రామాలల్లో ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఇబ్బం దులకు గురయ్యారు. కుప్పలపై టార్పాలిన్ కవరు కప్పినా కూడా ధాన్యం తడిసిపోయింది.


పెద్దూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలపై ఉన్న నీటిని తీసేస్తున్న రైతులు

కంకర పోశారు.. తారు వేయడం మరిచారు

మానకొండూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవంపల్లి-కొండపల్కల రోడ్డు నిర్మాణానికి కంకర పోసి నెలలు గడుస్తున్నా ఇంతవరకు తారు వేయలేదు. దీంతో రెండు గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై పోసిన కంకరతో ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పడిపోతున్నాయి. ఈ రోడ్డుపైన ప్రయాణించాలంటేనే జంకుతున్నారు. మండలంలోని లలితాపూర్ నుంచి దేవంపల్లి వరకు తారు రోడ్డు పూర్తిగా చెడిపోయింది. దీంతో లలితాపూర్ నుంచి దేవంపల్లి మీదుగా కొండపల్కల వరకు ఏడు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి రూ.2,47,70,000 రూపాయలు మంజూరు అయ్యాయి. ఈ రోడ్డు నిర్మాణం పూర్తైతే కొండపల్కల గ్రామస్థులు దేవంపల్లి, అన్నారం మీదుగా కరీంనగర్ ప్రయాణం సులభమవుతుంది. రోడ్డు నిర్మాణం త్వరగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కంకరతో కూడిన దేవంపల్లి-కొండపల్కల రోడ్డు

ఏసీబీ వలలో ఇద్దరు ఎస్సారెస్పీ అధికారులు

- బిల్స్ మంజూరు కోసం సహోద్యోగి వద్ద లంచం డిమాండ్


ఏసీబీకి పట్టుబడిన అధికారులు


బాధితుడు ఇజాజ్

సుల్తానాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సహ ఉద్యోగి మెడికల్ లీవ్ బిల్స్ మంజూరు కోసం 20 వేల రూపాయలు లంచం డిమాండ్ చేసిన ఇద్దరు ఎస్సారెస్పీ ఉద్యోగులు బుధవారం ఏబీసీకి చిక్కారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డివిజన్ నంబర్ 6 కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఇజాజ్ ఉల్‌హక్ మూడు నెలలు మెడికల్ లీవ్‌లో ఉన్నాడు. అనంతరం విధుల్లో చేరిన ఇజాజ్ ఉల్‌హక్ లీవ్‌కు సంబంధించిన బిల్లుల మంజూరుకు దరఖాస్తు పెట్టుకున్నాడు. 88రోజుల మెడికల్ లీవ్స్‌కు సంబంధించి 2.40లక్షల రూపాయల బిల్స్ ఆయనకు రావాల్సి ఉంది.

బిల్స్ రికార్డు చేయడానికి సుల్తానాబాద్‌లోని ఎస్సారెస్పీ ఆఫీస్‌లో పనిచేస్తున్న సూపరింటెండెంట్ డి శ్రీధర్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ సురేష్ 20వేల రూపాయల లంచం డిమాండ్ చేశారు. దీంతో ఇజాజ్ ఉల్‌హక్ ఈ నెల 19న కరీంనగర్‌లోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనమేరకు బుధవారం సుల్తానాబాద్‌లోని ఎస్సారెస్పీ ఆఫీసులో సూపరింటెండెంట్ శ్రీధర్ బాబు, సీనియర్ అసిస్టెంట్ సురేష్‌కు 20వేల రూపాయల లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో దాడిచేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని శ్రీధర్‌బాబు, సురేష్‌ను ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్పీ రమణమూర్తి, సీఐలు కృష్ణ, పున్నం చందర్, సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీతకు యునెస్కో గుర్తింపు

హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా హిందూ మత పవిత్ర గ్రంథమైన భగవద్గీతకు యునెస్కో గుర్తింపు లభించింది. భగవద్గీతతోపాటు భరత ముని రాసిన నాట్య శాస్త్రానికి కూడా గుర్తింపు దక్కింది. యునెస్కో తన మెమరి ఆఫ్ వరల్డ్ రికార్డులో ఈ రెండింటికి చోటు కల్పించింది. ఈ విషయంపై జిల్లా వాసులు, గీతాపారాయణపరులు, వివిధ ఆధ్యాత్మిక, భజన, భక్తి, భజన సంగీత విభాగాలకు చెందినవారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గీతా జయంతికి కార్యక్రమాలు కూడా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఆనంద జీవన ప్రయాణానికి గీత అవసరం

అక్షయచైతన్య, కరీంనగర్ చిన్మయమిషన్ ఆచార్యుడు



సవాళ్లు, సమస్యలకు పరిష్కారం చూపి ఆనంద జీవన ప్రయాణం చేసేందుకు ఉన్నత సూత్రాలను, నైతిక విలువలను అందించే జ్ఞాన సంపద భగవద్గీత. యునెస్కో గుర్తింపుతో గీత ప్రపంచానికి మార్గనిర్దేశనం చేస్తుందని ఋజువైంది.

గర్వకారణం : బండ సత్తయ్య, గీతా భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు



భగవద్గీతకు యునెస్కో గుర్తింపు రావడం గర్వకారణం. గీతను మరిస్తే మనల్ని మనమే మరచినట్లు. గీతా భక్త సమాజం ద్వారా 14 వేల పుస్తకాలు ముద్రించాము. 10 వేల వరకు ఉచితంగా పంపిణీ చేశాం.

భగవద్గీత సారాంశాన్ని అర్థం చేసుకోవాలి

విష్ణుసేవానందగిరి స్వామి, మళయాళ సద్గురు గీతామందిర సన్యాస మఠం



భగవద్గీత మానవుల నుదుటి గీతగా చెబుతారు. భగవద్గీతలోని సూక్తులను, సారాంశాన్ని అందరూ అర్థం చేసుకొని ఆచరణలో పెడితే జీవితాలు సుగమం అవుటతాయి. గీతను నిత్య పారాయణం చేయాలి. దీంతో మానసిక, శారీరక, లౌకిక ప్రశాంతత చేకూరుతుంది.

విస్తర్లే వారి జీవనాధారం

విస్తరాకులు కుడుతూ ఉపాధి పొందుతున్న రామోజిపేట మహిళలు



విస్తరాకులు కుడుతున్న మహిళలు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట మండల కేంద్రానికి దూరంగా చుట్టూ గుట్టల మధ్య ఉండే రామోజిపేట గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. గ్రామానికి చెందిన దాదాపు 50 మంది మహిళలు 30 సంవత్సరాలుగా మోదుగ ఆకులతో విస్తర్లు కుడుతూ ఉపాధి పొందుతున్నారు. పేపర్‌ప్లేట్లు మార్కెట్‌లోకి రావడం వల్ల విస్తరాకులు ఆదరణ కోల్పోయినా ఇటీవల పరిణామాలతో మళ్లీ ప్రజలు విస్తరాకుల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో గ్రామసమీపంలోని గోకరిగుట్ట, ఎడ్లోనిబోరు, ఏపగుట్టలకు ఉదయమే వెళ్లి మోదుగ ఆకులు తెచ్చుకునేవారు. ప్రస్తుతం మోదుగు చెట్లు తగ్గడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి ఆకులు తెచ్చుకుంటున్నారు. తెచ్చిన ఆకులను ఎండబెట్టి కొద్ది రోజుల తర్వాత విస్తారాకులు కుడుతారు. ప్రతి ఇంటి ఎదుట మోదుగ ఆకుల కట్టలు కనిపిస్తుంటాయి. 80 విస్తర్లు కట్టగా కట్టి అమ్ముతుంటారు. కట్టకు 130 రూపాయల వరకు అమ్ముతున్నారు. ఇక్కడి నుంచి సిరిసిల్ల, వేములవాడ, ధర్మపురి, కొండగట్టు తదితర ప్రాంతాలకు తీసుకవెళ్లి అమ్ముతుంటారు. గ్రామానికి సైతం ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి తీసుకొని వెళుతుంటారు.



ఇళ్ల ఎదుట ఆరబెట్టిన మోదుగ ఆకు

విస్తరాకులతో ఉపాధి పొందుతున్నాం..

ఈదుల్ల పుష్ప, గృహిణి రామోజిపేట



గ్రామంలోని మహిళలు మధ్యాహ్నం సమయంలో విస్తరాకులు కుడుతూ ఉపాధిపొందుతున్నాం. మోదుగ ఆకులు దొరకక ఇబ్బంది పడుతున్నాం. అటవీ ప్రాంతానికి వెళ్లినప్పుడు కొన్ని సార్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం విస్తారాకులు కుట్టడాన్ని కుటీర పరిశ్రమగా గుర్తించి రుణసహాయం అందించాలి.

మోదుగు ఆకులు దొరకడం లేదు..

బెజ్జంకి జయ, గృహిణి రామోజిపేట





విస్తరాకులు కుట్టడం వల్ల కొన్ని డబ్బులు వస్తున్నాయి. పుణ్యక్షేత్రాల వద్ద అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. కుట్టిన విస్తర్లు అమ్మడానికి ఇబ్బంది అవుతుంది. రవాణా చార్జీలు ఎక్కువ అవుతున్నాయి. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి. బీడుభూములను సాగుచేస్తుండటం వల్ల మోదుగ ఆకులు దొరకడం కష్టంగా మారింది.

కాంగ్రెస్ పాలనలో తిరోగమనంలో రాష్ట్రం

- ఏ ఎన్నిక జరిగినా ఎగిరేది గులాబీ జెండాయే
- శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

పెద్దపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం తిరోగమనంలో పయనిస్తున్నదని, రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినా ఎగిరేది గులాబీ జెండాయేనని శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. సింగరేణి బొగ్గు గనులను ప్రైవేట్ పరం కాకుండా కేసీఆర్ కాపాడితే, వాటిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్రం వద్ద తాకట్టు పెట్టారని ఆరోపించారు. బుధవారం పెద్ద పల్లిలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఒక ప్రాంతీయ పార్టీని 25 ఏళ్లు నడపడం ఆషామాషీ కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పుట్టుకు వచ్చిన 160 నుంచి 170 ప్రాంతీయ పార్టీలు నిలవలేకపోయాయని, ఒక్క టీడీపీ, బీఆర్ఎస్ మాత్రమే తట్టుకుని నిలబడ్డాయన్నారు. గులాబీ కండువా కనబడితే కొట్టుకోని గుండే లేదన్నారు. దేశానికే ఆదర్శంగా కేసీఆర్ తీసుక వచ్చిన రైతు బంధు పథకాన్ని కాంగ్రెస్ పార్టీ నీరుగార్చిందన్నారు.

రైతులకు భరోసా లేకుండా చేసిందన్నారు. నార్లు పోస్తే నీళ్ల వచ్చే పరిస్థితి లేదని, పండిన పంటను కొనే దిక్కులేదని అన్నారు. గ్రూపు-1 నియామకాల్లో అంతటా అవినీతి జరిగిందని, అనేక మంది నిరుద్యోగులకు అన్యాయం జరిగిందన్నారు. కేసీఆర్ కిట్‌ను అమలు చేయక, ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రసవాల కోసం మహిళలు రావడం లేదని, మళ్లీ ప్రైవేట్ ఆసుపత్రుల బాట పడుతున్నారని మండిపడ్డారు. లాభాల వాటా ఇచ్చే విషయంలోనూ కాంగ్రెస్ సింగరేణి కార్మికులను మోసం చేసిందన్నారు. వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్‌రావు, టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమళ్ల రాకేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, పార్టీ నాయకులు గంటా రాములు యాదవ్, దాసరి ఉష, పెంట రాజేష్, ఉప్పు రాజు కుమార్, బండారి శ్రీనివాస్‌గౌడ్, మర్కు లక్ష్మన్, పసుల చరణ్, బాలాజీరావు, బొడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి పాల్గొన్నారు.

జేఎన్టీయూలో కొనసాగుతున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమ్మె

కొడిమ్యాల, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూలో కాంట్రాక్ట్ అధ్యాపకులు చేస్తున్న సమ్మె బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. కాంట్రాక్ట్ అధ్యాపకులు బైక్‌లపై ర్యాలీగా వెళ్లి కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం చేసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని స్వామి వారికి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమను రెగ్యుల రైజేషన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు డాక్టర్ రాజేష్, శ్రీనివాసారావు, యామిని, సుజాత, మధుకర్, రాజు పాల్గొన్నారు.



కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో కాంట్రాక్ట్ అధ్యాపకులు

పీసీసీ అబ్జర్వర్లుగా సత్యనారాయణ, శ్రీనివాస్ నియామకం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణానికి చెందిన గ్రంథాలయం జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణను కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అబ్జర్వర్‌గా, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్‌ను పెద్దపెల్లి కాంగ్రెస్ పార్టీ జిల్లా అబ్జర్వర్‌గా నియమిస్తూ బుధవారం ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి ఇచ్చిన బాధ్యతలను స్వీకరిస్తున్నామన్నారు. జిల్లాలో పార్టీ శ్రేణులను కలుపుకొని పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు.



నాగుల సత్యనారాయణ



సంగీతం శ్రీనివాస్

బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా సమ్మయ్య



భగత్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా పిట్టల సమ్మయ్య ఎన్నికయ్యారు. రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్‌లో యూనియన్ రాష్ట్ర నాలుగో మహాసభలు మూడు రోజులు కొనసాగాయి. ఇందులో కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలానికి చెందిన పిట్టల సమ్మయ్య రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా గందె కొమురయ్య, రేగుల కుమార్ ఎన్నికయ్యారు. వారి ఎన్నికపై యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, అనిశెట్టి చంద్రయ్య, కన్నం సదానందం, కార్యదర్శి ఖాన్ పాష, లక్ష్మణ్, బాదుల్లా నాయకులు జగన్, రమేష్ హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను అడుగడుగునా అవమానించింది..

బీజేపీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ అడుగడుగునా అవమానించందని, అంబేద్కర్ ఆశయ సాధనతో ముందుకు సాగాలని భారతీయ జనతాపార్టీ దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ కోరారు. భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బుధవారం జిల్లా సదస్సును జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ అధ్యక్షతన జరిగింది.

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీకి ఉందన్నారు. అంబేద్కర్ చనిపోతే ఆయన అంత్యక్రియలు ఢిల్లీలో జరగనివ్వకుండా ముంబైకి ఆయన పార్థివదేహాన్ని తర లించిందన్నారు. పార్థివదేహం తరలింపునకు అయ్యే విమాన చార్జీలు, బిల్లులు చెల్లించాలని అంబేద్కర్ సతీమణికి నోటీసులు పంపించిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ, పండింత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ఆలోచనా విధానాన్ని బలపరిచి అంబేద్కర్‌కు ఆయన ఆలోచనలకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం తగిన గౌరవం ఇస్తోందన్నా రు. భావితరాలకు అంబేద్కర్ చరిత్ర తెలిసేలా పంచ తీర్థాలను ఏర్పాటు చేయడంతో పాటు దళితుడైన రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిగా చేసిందన్నారు. అణగారిన వర్గాల్లో వెలుగులు నింపిన అంబేద్కర్‌కు భారతరతన్న కోసం బీజేపీ కృషి చేసిందన్నారు.

ఈ సదస్సులో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జెనవాడే సంగప్ప, దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి కుమ్మరి శంకర్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎర్ర మహేష్, అల్లాడి రమేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మ్యాన రాంప్రసాద్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొక్కు దేవేందర్ యాదవ్, జిల్లా కార్యదర్శి రేగుల దేవేం దర్, కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీ నర్ అడెపు రవీందర్, అసెంబ్లీ నియోజకవర్గాల కన్వీనర్‌లు కారెడ్ల మల్లారెడ్డి, మరుతు సత్తయ్య, జిల్లా అధికార ప్రతి నిధి బర్కం నవీన్ యాదవ్, సంతోష్ రెడ్డి, అంబేద్కర్ జయంతి ఉత్సవాల కన్వీనర్ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చంటి మహేష్, కో-కన్వీనర్ కొంపెల్లి రాజేందర్, యాదగిరి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.



సిరిసిల్లలో బీజేపీ సదస్సులో మాట్లాడుతున్న ఎస్ కుమార్

పగిలిన ఎన్టీపీసీ యాష్‌పాండ్ పైపులైన్





ఇళ్లలోకి చేరిన బూడిద నీరు

అంతర్గాం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి ఏరియాలో గల అక్బర్‌నగర్ కాలనీలో బుధవారం ఎన్టీపీసీ యాష్ పాండ్‌కు వెళ్లే పైపులైన్ పగలడంతో సమీపంలోని ఇళ్లలోకి బూడిద నీరు చేరి కాలనీమొత్తం జలమయమైంది. ఎన్టీపీసీ నుంచి కుందనపల్లి యాష్ పాండ్ వెళ్లే పైపులైన్ ఇళ్లను ఆనుకొని ఉండడంతో పైపులైన్ పగలగా బూడిద నీరు లీకేజీ గంట పాటు కొనసాగింది. భయాందోళనతో కాలనీవాసులు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న ఎన్టీపీసీ అధికారులు పైపులైన్‌కు బూడిద నీటి సరఫరా నిలిపివేయడంతో కాలనీవాసులు ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే సమీపంలోని ఇళ్లతో పాటు వందమీటర్ల మేరకు రహదారిపై బూడిద చేరడంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎన్టీపీసీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని అక్బర్‌నగర్ కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలోకి మొత్తం బూడిద నీరు చేరడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీని స్థానిక రామగుండం ఎస్ఐ సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకుడు ఎండీ ఆసిఫ్ సందర్శించారు. ఎన్టీపీసీ అధికారులు అటువైపు రాకపోవడంతో కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ. 2.01 కోట్లు

184 గ్రాముల బంగారం, 12 కిలోల 300 గ్రాముల వెండి



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజ రాజేశ్వర స్వామివారి ఆలయ ఖజానాకు రూ. 2 కోట్ల ఒక లక్ష 53 వేల 852 నగదు సమకూరినట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి వెల్లడించారు. రాజన్న ఆలయ ఆవరణలోని ఓపెన్‌స్లాబ్‌లో గత 29 రోజుల హుండీలను అత్యంత భద్రత మధ్య బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి రూ. 2 కోట్ల ఒక లక్ష 53 వేల 852 నగదు ఆదాయం రాగా 184 గ్రాముల మిశ్రమ బంగారం, 12 కిలోల 300 గ్రాముల వెండి సమకూరినట్లు తెలిపారు. హుండీల లెక్కింపును ఆలయ ఈవో వినోద్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ సహాయ కమిషనర్ కార్యలయ డివిజనల్ ఇన్ స్పెక్టర్ ఎస్పీఎఫ్ సిబ్బంది, శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వసతిగృహాల నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

- కొండగట్టు పర్యటనలో ఏపీ డిప్యూటీ సీఎంకు అధికారుల వినతి
- అంజన్న ఘాట్ రోడ్డు సమీపంలో టీటీడీ ఇంజనీరింగ్ అధికారుల స్థల పరిశీలన
- పనులు ప్రారంభించకపోవడంతో భక్తుల ఇక్కట్లు





ప్రతిపాదిత వంద గదుల నిర్మాణ ప్రాంతం

మల్యాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో ప్రతిపాదిత తిరుమల తిరుపతి దేవస్థానాల వంద గదుల నిర్మాణం ఊసే లేదు.



టీటీడీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం(ఫైల్)

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గతేడాది జూన్ 29న కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చిన ఏపీ డిప్యూటి సీఎం పవన్‌కళ్యాణ్‌కు తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా వంద గదుల సత్రం నిర్మాణంతో పాటు రెండు వేల మంది కూర్చునే దీక్ష విరమణ మండపం ఏర్పాటుకు కృషి చేయాలని దేవస్థానం అధికారులు, అర్చకులు వినతిపత్రం అందజేశారు. దీనికి పవన్ సానుకూలంగా స్పందించగా పలుమార్లు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో పాటు దేవస్థానం అధికారులు పవన్‌కళ్యాన్ దృష్టికి తీసుకెళ్లారు.

ఇందులో భాగంగానే గదులతో పాటు దీక్షావిరమణ మండపం నిర్మాణంకుగాను గత అక్టోబరులో తెలంగాణలో టీటీడీ ఇంజనీరింగ్ వ్యవహారాలు పర్యవేక్షించే టీటీడీ డీఈ పీవీ.నాగరాజు, ఏఈ జే.నాగరాజు కొండగట్టుకు వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి వంద గదులు, దీక్షావిరమణ మండప నిర్మాణంకు ఘాట్‌రోడ్డు పక్కన, జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో దేవస్థానం భూములను పరిశీలించారు. టీటీడీ అధికారుల పరిశీలన జరిగిన పక్షం రోజుల్లోనే దేవస్థానానికి చెందిన సర్వే నం.362/1లో గదుల నిర్మాణంకు అవసరమైన స్థలం కేటాయిస్తూ టీటీడీకి కొండగట్టు దేవస్థానం తరపున లేఖ కూడా రాశారు. పనులను త్వరితగతిన ప్రారంభించాలని అందులో కోరారు. అయితే కొన్నాళ్లుగా గదుల నిర్మాణం ఊసే లేకుండా పోయింది. ఏపీ డిప్యూటి సీఎం చొరవతో కొండగట్టులో వంద గదుల నిర్మాణంకు అనుమతులు లభిస్తాయని భక్తులు, ఈ ప్రాంత వాసులు ఆశించారు. అయితే పవన్ కళ్యాణ్ వచ్చి ఏడాది సమీపిస్తున్నప్పటికీ టీటీడీ గదుల నిర్మాణం ప్రతిపాదనలు ముందుకు వెళ్లకపోవడంతో భక్తులు నిరాశ చెందుతున్నారు. టీటీడీ పాలక మండలి సమావేశంలో కొండగట్టు గదుల నిర్మాణాన్ని చర్చించేలా ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ప్రత్యేక చొరవ చూపాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

కరీంనగర్- తిరుపతి రైలు పొడిగింపు ఎప్పుడు?

(5వ పేజీ తరువాయి)

మంది వరకు ఉంటున్నారు. చివరకు తత్కాల్ టిక్కెట్లు బుక్ చేసుకున్న వారిని కూడా 30 వరకు వెయిటింగ్ లిస్టులో పెడుతు న్నారు. ముఖ్యంగా సెలవు దినాల్లో అధిక వెయిట్ లిస్టు ఉంటున్నది. వారంలో రెండు రోజులు నడుస్తున్న రైలు సీట్లన్నీ కరీంనగర్, పెద్దపల్లి, వరంగల్‌లోనే పూర్తి స్థాయిలో నిండుతున్నాయి. తిరుపతికి మాత్రమే కాకుండా విజయవాడ, శ్రీకాళహస్తి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు ఎంతగానో ఈ రైలు ఉపయోగపడుతున్నది. తిరుపతికి వెళ్లేందుకు గతంలో రైల్వే సేవలు తక్కువగా ఉండడంతో అక్కడికి వెళ్లి మొక్కులు సమర్పించుకునే వాళ్ల సంఖ్య తక్కువగా ఉండేది. రామగుండం లైన్ నుంచి కేరళ ఎక్స్‌ప్రెస్, కాజీపేట, వరంగల్ మీదుగా కృష్ణా ఎక్స్‌ప్రెస్, పద్మావతి ఎక్స్‌ప్రెస్, కేరళ ఎక్స్‌ప్రెస్, ప్రత్యేక రైళ్లతో పాటు కరీంనగర్ నుంచి తిరుపతికి రైళ్లు అందుబాటులో ఉండగా భక్తుల సంఖ్య పెరుగుతున్నది. ప్రయాణికుల అవసరాలు, డిమాండ్‌ను గుర్తించి ఇప్పటికైనా కేంద్ర రైల్వే శాఖ స్పందించి కరీంనగర్ నుంచి తిరుపతికి వెళ్లే రైలును జగిత్యాల వరకు పొడిగించి వారానికి ఐదు రోజులు నడపాలని, ఈ రైలుకు శ్రీరాజరాజేశ్వర రైలుగా నామకరణం చేయాలని పలువురు కోరుతున్నారు.

భద్రతాలోపంతోనే టెర్రరిస్టుల కాల్పులు

● ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దేశంలో భద్రత లోపం వల్లనే జమ్ము కాశ్మీర్‌లో టెర్రరిస్టులు కాల్పులు జరడం దురదృష్టకరమని, దీన్ని యావత్ దేశ ప్రజలు ఖండించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఉగ్రవాదం లేదని చెబుతున్న బీజేపీ ఉగ్రవాదులను పెంచి పోషిస్తుందన్నారు. ఉగ్రదాడిపై ఐబీ, ఇంటలీజెన్స్, రా నిఘా వర్గాలు చెప్పినప్పటికీ నిర్లక్ష్యం వహించడం వల్లనే ఘటన చోటు చేసుకుందన్నారు. కశ్మీర్ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాలు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేష్, మహంకాళిస్వామి, కాల్వ లింగస్వామి, తిప్పారపు శ్రీనివాస్, పెద్దెలి ప్రకాష్, ముస్తాఫా పాల్గొన్నారు.

బోనం ఎత్తిన కవిత



కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో మూడు రోజు లుగా జరుగుతున్న రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి గోదావరిఖనికి వచ్చిన కల్వలకుంట్ల కవిత రేణుక ఎల్లమ్మ ఆలయన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భక్తులతో కలిసి బోనం ఎత్తారు.

ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి నివాళి

జూలపల్లి, ఏప్రిల్ 23. (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన కవి రచయిత, చిత్రకారుడు గుండు రమనయ్యగౌడ్ స్పందించి తన చిత్రలేఖనం ద్వారా జమ్ముకాశ్మీర్‌లోని పహల్‌గాం ఉగ్రదాడిలో ప్రానాలు కోల్పోయిన 30 మంది టూరిస్టులకు నివాళులర్పించారు. ఈ చిత్రంలో ఉగ్రవాదులుల దాడి చేస్తే మరనించిన వారు, భరత మాత కన్నీల్లు పెట్టుకున్నట్లుగా, ప్రపంచ దేశాలు మొత్తం తన నివాలులు అర్పించినట్లు, శాంతి పావురం గాయపడినట్లు ఈచిత్రంలో చిత్రించాడు.

టీబీజీకేఎస్ సమావేశానికి బీఆర్ఎస్ నేతల గైర్హాజరు

- బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నేతల మధ్య సమన్వయ లోపం

పెద్దపల్లి, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అనుబంధ సంఘమైన టీబీజీకేఎస్ సమావేశానికి ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలు గైర్హాజరయ్యారు. బుధవారం రాత్రి గోదావరిఖనిలో నిర్వహించిన టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ సమావేశానికి గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హాజరయ్యారు. అంతకు ముందు ఆమెకు పట్టణంలో టీబీజీకేఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. పెద్ద గజమాలతో సత్కరించి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు, అయితే ఈ సమావేశానికి టీబీజీకేఎస్ ఏర్పాటు ఆవిర్భావంలో ప్రధాన పాత్ర పోషించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ తదితరులు హాజరు కాకపోవడం సింగరేణి కార్మికుల్లో చర్చనీయాంశంగా మారింది. అంతకంటే ముందు పెద్దపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కవిత ప్రెస్‌మీట్ కార్యక్రమంలో పాల్గొన్న సదరు నాయకులు టీబీజీకేఎస్ సమావేశంలో కనబడక పోవడం గమనార్హం. కోరుకంటి చందర్‌కు మినహా కొప్పుల ఈశ్వర్, పుట్ట మధూకర్‌కు ఆహ్వానించని కారణంగానే ఆ ముగ్గురు నాయకులు సమావేశానికి దూరంగా ఉన్నట్లు తెలుస్తున్నది.

తీవ్ర కాలేయ వ్యాధి గల సింగరేణి కార్మికులకు సగం జీతంతో ప్రత్యేక సెలవు

● ఉత్తర్వులు జారీ చేసిన సింగరేణి యాజమాన్యం

గోదావరిఖని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తీవ్ర కాలేయ వ్యాధి (లివర్ సిరోసిస్) బారిన పడిన సింగరేణి కార్మికులకు 50శాతం వేతనంతో ప్రత్యేక సెలవు మంజూరు చేయనున్నట్లు సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ఆదేశం మేరకు జీఎం పర్సనల్ (ఐఆర్ అండ్ పీఎం) బుధవారం ఈ సర్కులర్‌ను జారీ చేశారు. ఇప్పటి వరకు ఈ వెసులుబాటును ఏడు తీవ్ర వ్యాధులకు మాత్రమే వర్తింప చేస్తున్నారు. గుండె జబ్బు, క్షయ, క్యాన్సర్, కుష్టు, పక్షవాతం, మూత్ర కోశ వ్యాధులు, ఎయిడ్స్, మెదడు వ్యాధులకు ఈ స్పెషల్ లీవ్ ఇస్తున్నారు. కాగా ఇటీవల కోల్ ఇండియా స్థాయిలో జరిగిన ఎన్‌సీడబ్ల్యూఏ 11వ వేతన ఒప్పందంలో లివర్ సిరోసిస్ (తీవ్ర కాలేయ వ్యాధి) బాధితులకు కూడా స్పెషల్ లీవ్ వర్తింపచేయాలని నిర్ణయించడంతో సింగరేణి యాజమాన్యం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తీవ్ర కాలేయ వ్యాధికి గురైన కార్మికునికి స్పెషల్ లీవు మంజూరు చేయవచ్చని, వ్యాధి నయమై, విధులకు ఫిట్ అయ్యేంత వరకు అతనికి 50శాతం వేతన మొత్తం (బేసిక్ పే, వీడీఏ, ఎస్‌డీఏలో 50శాతం) చెల్లించవచ్చని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. కాగా సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ కృషితోనే ఈ సర్క్యులర్ జారీ అయినట్లు ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పేర్కొన్నారు. మండలంలోని పెద్దకల్వల, పెద్దబొంకూరు, కొత్తపల్లి, మూలసాల, బోజన్నపేట, హనుమంతునిపేట, మారేడుగొండ, గుర్రాంపల్లి గ్రామాల్లో సింగిల్ విండో, ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కటింగ్ లో లేకుండా వడ్లు కొనుగోలు చేయడంలో పెద్దపల్లి నియోజకవర్గం రాష్ట్రంలోనే గుర్తింపు పొందిందన్నారు. ప్రస్తుత పంట కాలానికి సాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. ఈ పంటకు కూడా సన్న వడ్లకు 5 వందల రూపాయల బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, సింగిల్ విండో చైర్మన్ మాదటి నరసింహ రెడ్డి, మాజీ జడ్‌పీటీసీ బండారి రామ్మూర్తి,కడర్ల శ్రీనివాస్, ఆరే సంతోష్, కట్కూరి సుధాకర్ రెడ్డి , కలబోయిన మహేందర్, నూగిల్ల మల్లన్న, ఆర్కుటీ సంతోష్, కరెంగుల రమేష్ పాల్గొన్నారు

ఎలిగేడు : వ్యవసాయ రంగానికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. బుధవారం మండంలోని బురహన్‌మియాపేట, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో ఐకేపీ, సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. సుల్తాన్‌పూర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 24మంది కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.24,2,784విలువగల చెక్కులను సీఎంఆర్ఎఫ్ కింద 69మంది లబ్ధిదారులకు రూ.20,27,500లక్షల విలువగల చెక్కులను పంపిణీ చేశారు. 10జీపీ సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు.

ఇంటర్‌లో సింగరేణి కళాశాలకు అత్యధిక మార్కులు

గోదావరిఖని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో కొత్తగూడెం సింగరేణి మహిళా కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులతో విజయదుందుభి మోగించారు. ఈ సందర్భంగా బుధవారం సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ ఉత్తమఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఇంటర్ విద్యార్థిని హసిని 992మార్కులతో రాష్ట్ర స్థాయిలో సరికొత్త రికార్డు సృష్టించింది. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో రాష్ట్ర ఉత్తీర్ణత శాతం 71.37 కాగా మహిళా కళాశాల 81 శాతం ఉత్తీర్ణత సాధించింది. అలాగే ఇంటర్ ప్రథమ సంవత్సరం రాష్ట్ర ఉత్తీర్ణత శాతం 66.89 కాగా కళాశాలకు 73.07శాతం సాధించింది.

పాఠశాలలో సాంకేతిక శిక్షణ శిబిరం

మంథని, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హైస్కూల్ టీ. వర్క్, బెటర్ విట్స్ సంయుక్తంగా సాంకేతిక శిక్షణ శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడానికి సాంకేతిక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో జేసీబీ, హార్వెస్టర్, డ్రిల్లర్, కల్టివేటర్ లాంటి యంత్రాల నిర్మాణం, పని తీరును రెండు సంస్థల నిర్వాహకులు రాకేష్, ఉదయ్, అనిల్ వివరించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్‌పై నాన్ బెయిలబుల్ కేసు

మంథని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మంథని సబ్ రిజిస్ట్రార్‌పై నాన్‌బెయిలెబుల్ సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు హైకోర్టు న్యాయవాది ఇనుముల సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథని మున్సిపల్ పరిధిలోని ఎస్ఆర్‌కే అపార్టుమెంట్ ఏరియాలోని ఎరుకల గూడెంలో పడావు పడ్డ భూమిని ప్రభుత్వ భూమి లేక పట్టా భూమి అనేది నిర్ధారణ చేయకుండానే, ఎలాంటి లింకు దస్తావేధులు లేకుండానే సర్వే నెం. తెలుపకుండా, రేకుల షెడ్ ఉన్న స్థలాన్ని ఖాళీ స్థలంగా పేర్కొంటూ ప్రభుత్వ, మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టే విధంగా పక్కనే ఉన్న ఇంటి నెం. వేసి బహిరంగ మార్కెట్‌లో రూ. 50 లక్షల విలువ చేసే రెండు గుంటలపై ఉన్న విలువైన స్థలాన్ని రెండు గిఫ్టు డీడ్‌ల పేరిట మంథని సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేసిన వ్యవహారం, అక్రమ రిజిస్ట్రేషన్లపై జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంథని పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారన్నారు. ఈవ్యవహారంలో ఉన్నతాధికారలు విచారణ చేసి రిజిస్ట్రేషన్లు రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

చదువుతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

కమాన్‌పూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నేటిబాలలే రేపటి పౌరులని విద్యతోపాటు మంచి క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమని కమాన్‌పూర్ ఎస్సై కొట్టె ప్రసాద్ అన్నారు. మండలంలోని జూలపల్లి గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పేరెంట్స్, టీచర్స్, గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 6నుండి 9వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఎస్సై ప్రసాద్ చేతులమీదుగా స్వర్ణ, కాంస్య, రజత పథకాలు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు సుజాత, వీఓ ప్రేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కశ్మీర్‌లో ఉగ్రదాడి మృతులకు ఘన నివాళి


పెద్దపల్లి బస్టాండ్ వద్ద నివాళులర్పిస్తున్న ముస్లింలు


ఎన్టీపీసీలో నివాళులర్పిస్తున్న ఉద్యోగులు

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గావ్‌లో పర్యాటకులపై మిలిటరీ దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూకలు దాడి జరిపి పలువురిని కాల్చి చంపిన ఘటనను పెద్దపల్లి పట్టణానికి చెందిన ముస్లింలు తీవ్రంగా ఖండించారు. బుధవారం రాత్రి ఈ దాడిని నిరసిస్తూ మృతులకు నివాళులర్పిస్తూ బస్టాండ్ చౌరస్తాలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హమీద్, సజ్జద్, ఆరీఫుద్దీన్, జావిద్, మసూద్ బేగ్, ఫహీం, జావీదుద్దీన్, ఎంఏ హదీ, తబ్రేజ్, మతిన్, సుజాత్ బేగ్, మన్నన్, ఇమ్రాన్, యాకూబ్, ఖలీల్, షాకీర్, ముజీబ్ ఖాన్, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతినగర్: కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన మృతులకు ఎన్టీపీసీ ఉద్యోగులు బుధవారం కొవొత్తులతో నివాళి అర్పించారు. ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో కొవ్వొత్తులతో ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. తెలంగాణకు చెందిన ఐటీ అధికారి మనీష్ రంజన్ చిత్ర పటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి బాబర్ సలీంపాషా, గుర్తింపు సంఘం మద్దూర్ యూనియన్ అధ్యక్షకార్యదర్శులు వి.కృష్ణయ్య, రాజేశ్వర్, మాజీ కార్పొరేటర్లు కొలిపాక సుజాత, కొలని కవిత, ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

ఓదెల: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై పాక్ ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ బుధవారం మండల కేంద్రంతో పాటు కొలనూర్‌లో బీజేపీ నాయకులు ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో తాజోద్దీన్, పుల్ల సదయ్య, పుల్లూరి పృథ్వీరాజ్, కారంగుల శ్రీనివాస్, దాత రాకేష్, కొంగరి అనిల్, తీర్థాల కుమార్, శాతాల్లా కుమార్, చందు, రామినేని రాజు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా బుధవారం కాంగ్రెస్ శ్రేణులు ఉగ్రవాదుల దిష్టి బొమ్మను దహనం చేశాయి. గుండేటి రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, శంకర్‌నాయక్, ఇరికి మహేష్, రాజేశ్వరి, చక్రపాణి, అనుము రాములు, తిరుపతిరెడ్డి, ఆకుల రాజిరెడ్డి, కేశవులు, సారయ్యనాయక్, వై తిరుపతి పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్: టెర్రరిస్టుల దిష్టిబొమ్మను బుధవారం యూత్ కాంగ్రెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు కౌటం సతీష్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహంకాళి స్వామి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, మాదరబోయిన రవికుమార్, తిప్పారపు శ్రీనివాస్, దీటి బాలరాజు, పెద్దెల్లి ప్రకాష్ ఉన్నారు.



సింగరేణిలో జనరల్ అసిస్టెంట్ డిజిగ్నేషన్

గోదావరిఖని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్‌పై పనిచేస్తున్న కార్మికులను ఇక నుంచి వారి డిజిగ్నేషన్‌ను జనరల్ అసిస్టెంట్‌గా మార్పు చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సర్క్యులర్ జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు కృషి

● ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్


మాట్లాడుతున్న కొరిమి రాజ్‌కుమార్

గోదావరిఖని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను ఏఐటీయూసీ అమలు చేసేందుకు కృషి చేస్తుందని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, దేశంలో ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు వేగంగా చర్యలు చేపట్టిందని ఆరోపించారు. ఎందరో కార్మికులు బలిదానంతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులను కట్టు బానిసలుగా మార్చే కుట్ర చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పేద ప్రజల కడుపుకొట్టి కార్పొరేట్ కంపెనీలకు దోచి పెడుతుందని, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా మే 20న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చట్ట ప్రకారం, న్యాయ బద్ధంగా సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ కృషి చేస్తుందని, కొన్ని కార్మిక సంఘాలు ఏఐటీయూసీపై దుష్ప్రచారం చేస్తున్నాయని, దీనిని కార్మికులు తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికుల సొంతింటి పథకం అమలు కోసం, అలవెన్సులపై ఆదయపన్ను మినహాయింపై కమిటీ వేసింది, దీనిని త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు స్వామి, ఆరెల్లి పోషం, రంగ శ్రీనివాస్, గోషిక మోహన్, కనకరాజు, దాసరి శ్రీనివాస్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మహిళా కళాశాల స్వర్ణోత్సవం


కళాశాల స్వర్ణోత్సవ లోగోను ఆవిష్కరిస్తున్న సీఎండీ

గోదావరిఖని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ కొత్తగూడెంలో తొలి మహిళా కళాశాలను ప్రారంభించి ఈ ఏడాదితో 50 ఏళ్ల పూర్తికావస్తున్న సందర్భంగా సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ రూపొందించిన గోల్డెన్ జూబ్లీ లోగోను సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ బుధవారం హైదరాబాద్ నుండి వర్చువల్‌గా ఆవిష్కరించారు. మహిళా విద్యకు అంకితమై ఐదు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఈ కళాశాల మరింతగా వృద్ధి చెందాలని, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ కళాశాలగా ఎదగాలని సీఎండీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్వీ సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ, పా) కే వెంకటేశ్వర్లు, సీపీపీ ఏ మనోహర్, కొత్తగూడెం నుంచి సింగరేణి విద్యాసంస్థల కార్యదర్శి గుండా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎండల తీవ్రత దృష్ట్యా పనివేళలు మార్చాలి


మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత దృష్ట్యా ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు పని వేళలను మార్చాలని ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతి డిమాండ్ చేశారు. బుధవారం ఓసీపీ-1 సైటాఫీస్‌లో జరిగిన గేట్‌మీటింగ్ లో ఆయన మాట్లాడారు. కూలర్ల ఏర్పాటు చేయాలని, డంపర్లలో ఏడీల్లో కూలింగ్ సరిగా జరగక ఆపరేటర్లు వేడి భరించలేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. హాల్ రోడ్డు నిర్వహణలో భాగంగా గ్రేడర్, డోజర్ల వినియోగం పెంచాలని తిరుపతి డిమాండ్ చేశారు. పెన్షన్ పెంపుదల విషయంలో ఎంపీ వంశీ కృషి చేస్తున్నారని, సింగరేణి కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెరిగేలా కనీస వేతనకమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్ కృషి చేస్తున్నట్లు తిరుపతి పేర్కొన్నారు. వెంకటస్వామితో పాటు కార్మికులు పాల్గొన్నారు.

వేసవి ఉపషమన చర్యలు తీసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ: ఓసీపీ-3 ప్రాజెక్టులో వేసవి ఉపశమన చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం సీఐటీయూ నాయకులు ప్రాజెక్టు మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని రెస్ట్‌హాల్‌లో, క్యాంటీన్‌లో కూలర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మొదటి, రెండవ షిఫ్టు పని వేళలను మార్చాలని, క్వారీలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ స్టేషన్ అందుబాటులో ఉంచాలని, క్యాంటీన్ ఆవరణలో అదనంగా ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలని వినతిపత్రంతో సీఐటీయూ నాయకులు కోరారు. స్టోర్ రూంలో సేఫ్టీ హెల్మెట్, సేఫ్టీ షూస్, కూల్ వాటర్ బాటిల్స్ డస్ట్ మాస్కులను అందుబాటులో ఉంచాలని కోరారు. భారీ యంత్రాల విడిభాగాలు ఆలస్యం కాకుండా అందుబాటులో ఉండేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. రెస్ట్‌హాల్ సరిపోని కారణంగా కార్మికులు చెట్ల కింద, బైక్ స్టాండ్‌లలో సేద తీరుతున్నారని, రెస్ట్‌హాల్‌ను ఆధునీకరించాలని కోరారు. మేనేజర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో బ్రాంచి సెక్రెటరీ కుంట ప్రవీణ్, పిట్ సెక్రెటరీ సారంగం, అసిస్టెంట్ సెక్రెటరీ వినేష్, నాయకులు సంపత్, సంతోష్, తిరుపతి ఉన్నారు.

న్యూస్ బాక్స్

● కోల్‌సిటీటౌన్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో హెచ్ఇసీ కోర్సులో అత్యధిక మార్కులు 978/1000 సాధించిన గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన కన్నాపురం స్ఫూర్తిని బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ దాసరి వేణు, జిల్లా నోడల్‌అధికారి కల్పన అభినందించారు.

● కళ్యాణ్‌నగర్: గోదావరిఖని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులకు బుధవారం కరీంనగర్ మెడికవర్ వైద్యులు సౌమిత, నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య విద్యార్థులకు సీపీఆర్ చేసే విధంగా శిక్షణ ఇచ్చారు.

● కోల్‌సిటీ: పాఠశాలలకు వేసవి సెలవుల దృష్ట్యా పిల్లలపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి సూచించారు. బుధవారం గోదావరిఖని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

● మంథని : పట్టణంలోని పలు టిఫిన్ సెంటర్లు, బేకరీలు, కిరాణాషాపులను మున్సిపల్ కమిషనర్ మనోహర్ బుధవారం తనిఖీ చేశారు.

● ముత్తారం: ముత్తారం మండల కేంద్రానికి చెందిన వధూవరులు రాపల్లి భవాని- శ్రీకాంత్‌లను, రంగయ్యపల్లె గ్రామానికి చెందిన సోషల్ మీడియా ఇన్‌చార్జి సోమిశెట్టి నరేష్-అభిజ్ఞ దంపతులను శ్రీపాద ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ఆశీర్వ దించారు.

● ముత్తారం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతిపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

● ఎలిగేడు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సుల్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాల అన్ని వసతులతో సుందరంగా ఉందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో నిలువాలి

రామగిరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుల్లో ఉన్నత స్థానంలో నిలువాలని జిల్లా విద్యాధికారి మాధవి సూచించారు. బుధవారం మండలంలోని కల్వచర్ల ప్రగతి పాఠశాల 30వ వార్షికోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర నాయకులు మల్లోజుల విజయానంద్, టీబీజీకేఎస్ నాయకుడు మిర్యాల రాజిరెడ్డి, కరస్పాండెంట్ అబ్బుకేశవరెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, నాగరాజాకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాము పాల్గొన్నారు.

కారుణ్య నియమాక పత్రాల అందజేత

రామగిరి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఏపిఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పిలో వివిధ కారణాలతో ఇన్వాలిడేషన్ అయిన డిపెండెంట్‌ల నాల్గురికి ఏపిఏ జీఎం నాగేశ్వర్‌రావు కారుణ్య నియమాక పత్రలను అందజేశారు. సింగరేణి ఉద్యోగం లబించడం వరంగా బావించాలని ఉద్యోగులకు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సర్ఫేస్ మజ్దూర్ పోస్టులకు రాత పరీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆర్జీ-2 ఏరియాలో ఖాళీగా ఉన్న సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులకు బుధవారం యాజమాన్యం అంతర్గత అభ్యర్థులకు రాత పరీక్షలు నిర్వహించింది. 90 మంది దరఖాస్తు చేసుకోగా సెక్టార్-3 సింగరేణి స్కూల్‌లో జరిగిన రాత పరీక్షకు 80 మంది అంతర్గత ఉద్యోగులు హాజరయ్యారు. డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, ఏరియా సర్వే అధికారి ఉజ్వల్ బదోపాధ్యాయ పాఠశాల హెచ్ఎం సుందర్‌రావు పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులుగా ఉన్నారు.

ఐఎన్‌టీయూసీ బాయిబాట

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఓసీపీ-3కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు ఐఎన్‌టీయూసీ బృందం బాయిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం కృషిభవన్, బేస్‌వర్క్‌షాప్‌లలో పర్యటించింది. సింగరేణి అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ, ఐఎన్‌టీయూసీ కృషి చేస్తున్నట్టు వైస్ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్ తెలిపారు. కొంగర రవీందర్, దశరథంగౌడ్ ఉన్నారు.